


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

మంగళవారం 28 జూలై 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3




# గోవును రాష్ట్ర మాతగా ప్రకటించాలి





భానుపురి సూర్యాపేట టౌన్/ కలెక్టరేట్

సకల దేవతలు కొలువైన మాతను రాష్ట్ర మాత గా ప్రకటించాలని కోరుతూ గో సమ్మాన్ అభియాన్ పిలుపులో భాగంగా సోమ వారం రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లా కలెక్టర్ లకు వినతి పత్రా లు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగం గా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాయి బాబా గోశాలలో గోవు లకు పూజలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ నంద లాల్ పవార్ కు వినతి పత్రం సమ ర్పించారు. ఈ సందర్భముగా గో సమ్మాన్ అభియాన్ సూర్యాపేట జిల్లా ఇంచార్జి గుమ్మడవెల్లి శ్యామ్ మాట్లాడుతూ భారత దేశము అంతటా గోవధను పూర్తిగా నిషేధించాలని అన్నారు. గోవును రాష్ట్ర మాత లేదా జాతీయ ఆరాధ్య దేవత రాజ్యాంగ హోదాను కల్పించి, జాతీయ గౌరవం ఇవ్వాలని తెలిపారు. గో రక్షణ కోసం కేంద్రం ఒక చట్టాన్ని రూపొం దించాలని, గోరక్షణ కోసం ఒక కేంద్ర మంత్రిత్వ శాఖలు ఏర్పాటు చేయాలన్నారు. ఒక గోగ్రస బోర్డు ఏర్పాటు చేయాలని, భూముల ఆధారిత వ్యవసాయాన్ని నిర్ధారిం చాలని అన్నారు. వేద రక్షణ గ్రూపుల నుండి లభించే పంచగవ్య ఉత్పత్తుల ఉత్పత్తి ఇప్పడిని పెంచాలని, నువ్వుల ప్రాముఖ్యతను విద్యలో అనం చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బేలిదే శ్రీనివాస్, శ్రీ వాసవి సేవా సమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, మహంకాళి సోమయ్య, కక్కిరేని ప్రసాద్, తోట లక్ష్మీ నరసయ్య భానుపురి సేవా బృందం శ్రీరంగం రాము,



యామ సంతోష్ లు పాల్గొన్నారు.




# దేగల జనార్ధన్ రాజీనామా తిరస్కరణ

భానుపురి /సూర్యాపేట టౌన్



సూర్యాపేట రైల్వే సాధన సమితి కన్వీనర్ గా వ్యవస్థాపకుడి గా నిలిచిన దేగల జనార్ధన్ ఈ సమితి కన్వీనర్ గా ఉండ లేనని చేసిన రాజీనామా అంశాన్ని కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. ఈ ఉద్యమాన్ని నడపగల సమర్థత ఆయనకు మాత్రమే ఉన్నదని అందువల్ల వ్యవస్థాపకుడిగా నిలిచిన ఆయన తిరిగి ఈ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు సమ యం ఇవ్వాలని ఎన్ని విచ్చిన్నాలు ఎదురైనా ఎన్ని విమర్శలు వచ్చినా సమిష్టిగా తమ బాధ్యత తీసుకుంటామని అందు వల్ల తిరిగి బాధ్యతల్లోకి రావాలని ఈ సమావేశానికి హాజరై న సభ్యులందరూ ఏకగ్రీవంగా కోరడంతో ఈ ఉద్యమం పట్ల బాధ్యతను విజ్ఞానాన్ని అవగాహనను అన్నింటిని తమ కు అందించాలని కమిటీ కోరింది రాజీనామాను ఆమోదిం చలేదు. ఈ అంశంపై దేగల జనార్ధన్ స్పందిస్తూ ఈ కమిటీ మరింత విస్తృత చేయాలని రాజకీయ జేఏసీ తో పాటుగా అన్ని జేఏసీలను వేయాలని రైల్వే సాధన కోసం ఇతరులు చేస్తున్న పోరాటాలతో సంబంధం లేకుండా మనం బలమైన ఉద్యమం నిర్మించాలని ఇంతమంది తనను అభిమానించి తన నాయకత్వం అంగీకరించి రైల్వే సాధన కోసం ముందుకు వచ్చేందుకు అంకితభావంతో పని చేస్తామని అనడంతో తిరిగి తన బాధ్యతను స్వీకరిస్తున్నట్టుగా దేగల జనార్ధన్ ప్రకటించారు. కార్యక్రమం దాదాపు రెండు గంటల పాటు అనేక విషయాలు చర్చించి ఉద్యమ కార్యాచరణ పై అనేక నిర్ణయాలు కూడా తీసుకోవడం జరిగింది . సభ గంభీరంగా ఉన్నతంగా అనేక అంశాలను లోతుగా అధ్యయనం చేసింది ఈ సందర్భంగా నూతన విస్తరణ కోసం ఆలోచన చేసింది. రాచూరి ప్రతాప్, నల్లపాటి అప్పారావు, డాక్టర్ ఏ రమేష్ చంద్ర, బిక్కుమల్ల ఉపేందర్, లింగంపల్లి భద్రయ్య, మారోజు కృష్ణమూర్తి, మామిడి అంజయ్య, కే మంజుల, నారబోయిన వెంకట యాదవ్ సముద్రాల రాంబాబు, కోడి వెంకటయ్య, మామిడి అంజయ్య, మీర్ అక్బర్, బొల్లె సైదులు, చెరుకు వెంకన్న, అక్కినేపల్లి రాము, వట్టే లింగరాజు తదితరులు పాల్గొన్నారు

# రాజకీయ అణచివేత ధోరణితోనే వజ్రా రైస్ మిల్ పై దాడులు

-టిఆర్పీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజ గౌడ్

-పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు



భానుపురి /సూర్యాపేట టౌన్

తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ ను రాజకీయ అణచివేత ధోరణితోనే వజ్రా రైస్ మిల్ పై దాడులు జరుగుతున్నాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని సోమవారం వజ్ర రైస్ మిల్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ వాదాన్ని రాష్ట్రవ్యాప్తంగా తెరమీదకి చేస్తున్నాడని అక్కసు తోనే దుర్మార్గపు చర్యలకు పూనుకుంటున్నారని వాపోయారు. వట్టె జానయ్య యాదవ్ సుమారు 60 నుంచి 70 కోట్లు దుర్వినియోగానికి పాల్పడ్డాడని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నిరాధారమైనవని తెలిపారు. సూర్యాపేటలో మారో జు వీరన్న వర్ధంతి సభ, భువనగిరిలో బహిరంగ సభ, ఇటీ వల ఈశ్వరమ్మ పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బహు జనుల్లో చైతన్యం తీసుకొస్తున్నాడనే కారణంతోనే కేసు లు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేయటం ఎంతవరకు సమం జసం అని ప్రశ్నించారు. 17 కోట్లతో ప్రారంభమైన వజ్ర రైస్ మిల్ సుమారు ప్రస్తుతం 100 కోట్ల ప్రాపర్టీని కలిగి ఉందని వట్టే జానయ్య యాదవ్ ఎక్కడికి పారిపోలేదని త్వరలో ప్రజల ముందుకు వచ్చి జరిగినటువంటి వాస్తవాలు తెలియపరు స్తాడని తెలిపారు. వజ్ర రైస్ మిల్ నుంచి ఏ మిల్లుకు ధాన్యాన్ని తరలించలేదని అవాస్తవాలను త్వరలో తిప్పికొడతా మని నిజం నిప్పులాంటిదని చెప్పారు. రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి నాలుగు ఏళ్లుగా ప్రభుత్వానికి వజ్ర రైస్ మిల్ నుచి రైస్ ను ఎగుమతి చేస్తున్నాడని వజ్ర రైస్ మిల్ ద్వారా వందలాది మందికి జీవన ఉపాధి కల్పిస్తున్నా డని తెలిపారు. రాజకీయంగా బీసీలు ఎదగకూడదనే ఆలోచన తోనే అగ్రకులాలు ఇలాంటి కుట్రలకు పాల్పడు తున్నారని ఆరోపించారు. నిత్యం బహుజన కులాల్లో చైతన్యం తీసు కొస్తూ ప్రజా సమస్యలపై పోరాడే నాయకుని పై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవం పలికారు. కార్యక్రమంలో టిఆర్పీ జిల్లా నాయకులు కుంభ వెంకన్న, నేలచర్ల మధు ప్రజాపతి, కాంటేకర్ రఘుమోహన్, గుంటూరు విజయ్, వల్లాల సైదులు, పెన్ పహాడ్ మండల అధ్యక్షుడు ఆవుల అంజయ్య యాదవ్, కోటేష్, టిఆర్పి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కోలా కరుణాకర్ ముదిరాజ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ఖాతాదారుల వాటాదారుల సహకారంతో పురోభివృద్ధి లో సుధా బ్యాంక్







భానుపురి /సూర్యాపేట టౌన్

వాటాదారుల ఖాతాదారుల సహకారంతో పురోభివృద్ధిలో సుధా బ్యాంక్ పయనిస్తుందని బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ చెప్పారు. స్థానిక త్రివేణి ఫంక్షన్ హాల్ లో జరిగిన 27వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ ,సహకార రంగంలో 27 సంవత్సరాలుగా అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ క్రమం తప్పకుండా వాటాదారులకు డివిడెంట్ పంపిణీ చేస్తూ పురోభివృద్ధిలో బ్యాంకు పయనిస్తుందని చెప్పారు. బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ ఎజెండా తీర్మానాలను చదివి వినిపించి వాటాదారుల ఆమోదం పొందారు. రాబోయే సంవత్సర కాలానికి బ్యాంకు సొంత భవనం ఏర్పాటు చేయాలని తీర్మానానికి వాటాదా రులందరూ హర్ష ఆమోదాలతెలిపారు. 9 బ్రాంచీలతో బ్యాంకు పటిష్టంగా ఉందని రాబోయే కాలం లో మరిన్ని శాఖలు ఏర్పాటు చేస్తామని మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ తెలియజేశారు. మొదట చైర్మన్ నివేదికను వైస్ చైర్మన్ కక్కిరేణి శేఖర్ చదివి వినిపించారు. బ్యాంకు పనితీరును సమీక్షిస్తూ పుర ప్రముఖులు వాటాదారులు గండూరి శంకర్ ,పెద్దిరెడ్డి రాజా ఇరికి కోటేశ్వరి ప్రసంగించారు . ఈ కార్యక్రమం లో బ్యాంకు డైరెక్టర్లు ఏపూరి శ్రవణ్ కుమార్ , మీలా సందీప్, తోట శ్యాంప్రసాద్ ,డాక్టర్ విజయలక్ష్మి ,అనంతల శారద, బానోతు సుజాత, పటేల్ నరసింహారెడ్డి ,బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్ సభ్యులు భువనగిరి భాస్కర్, ఇరుకుల్ల చెన్నకేశవరావు వెంపటి రమణ ,పొనుగోటి నిర్మల తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పోటాదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ

భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారంకోసం పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తుందని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ ఐపాస్ మరియు టీ-ప్రైడ్ పథకాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీజీ ఐపాస్ పోర్టల్ ద్వారా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తల నుంచి మంచి స్పందన వస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం కింద 25 యూనిట్లకు సంబంధించి వివిధ శాఖల నుంచి మొత్తం 57 అనుమతుల కోసం దరఖాస్తులు అందాయని వివరించారు. ఇందులో ఇప్పటికే 37 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామని, మిగిలిన 20 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిబంధనల ప్రకారం వేగంగా క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న టీ-ప్రైడ్ పథకంపై కలెక్టర్ ప్రత్యేకంగా



చర్చించారు. ఈ పథకం కింద ఎస్సీ కేటగిరీలో 05 దరఖాస్తులు, ఎస్టీ కేటగిరీలో 16 దరఖాస్తులను కమిటీ ఆమోదించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, జీఎం ఇండస్ట్రీస్ భారతి ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి ఎంఈఐ ఆదిత్య ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రైస్ మిల్లులో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ తనిఖీలు





భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, నల్గొండ జిల్లా విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పీ ఆధ్వర్యంలో, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు నల్గొండ జిల్లా విజిలెన్స్ ఑ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సంయుక్తంగా సోమవారం సూర్యాపేట జిల్లాలోని పలు రైస్ మిల్లులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పెన్‌పహాడ్ మండలం, మాచారం గ్రామంలోని జేపీ రైస్ మిల్ లో విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా, గత ఆరు నెలలుగా ప్రభుత్వానికి అప్పగించాల్సిన కస్టమ్ మిల్డ్ రైస్ సరఫరా చేయలేదని గుర్తించారు. అలాగే భౌతిక తనిఖీలో ప్రభుత్వానికి సంబంధించిన 4,886.50 మెట్రిక్ టన్నుల ధాన్యం లోటు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో సంబంధిత మిల్లు యాజమాన్యం పై అత్యావశ్యక వస్తువుల చట్టం, 1955 ప్రకారం సెక్షన్ 6-ఏ కింద కేసు నమోదు చేశారు. లోటుగా గుర్తించిన ధాన్యం విలువ సుమారు రూ.11.67 కోట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. సూర్యాపేట మండలం, కాసరాబాద్ గ్రామంలోని ఎస్‌వీఆర్‌ఐ రైస్ మిల్లో కూడా ఆక్షన్ ప్యాడీ, సీఎంఆర్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భౌతిక పరిశీలనలో ప్రభు త్వానికి సంబంధించిన 11,400.843 మెట్రిక్ టన్నుల ధాన్యం లోటు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో ఆ మిల్లు యాజమాన్యంపై కూడా సెక్షన్ 6-ఏ కింద కేసు నమోదు చేశారు. ఈ ధాన్యం విలువ సుమారు రూ.27.23 కోట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. ఈ రెండు మిల్లుల వ్యవహారాల్లో తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌కు సంబంధిత అధికారులు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.జిల్లాలో ప్రభుత్వ ధాన్యం, బియ్యం నిల్వలు, సీఎంఆర్ సరఫరా విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగినా వాటిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీలలో నల్గొండ జిల్లా విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పీ ఆధ్వర్యంలోని అధికారులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అసిస్టెంట్ సివిల్ సప్లైస్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు ప్రదీప్ రెడ్డి, రాజశేఖర్, విజిలెన్స్ సిబ్బంది, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గర్భిణి స్త్రీలకు శ్రీమంతాలు



భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట పట్టణంలోని రవి మహల్ నందు 30 మంది గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ త్రిశక్తి వనిత గ్రూప్ ఆధ్వర్యంలో గర్భిణి స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ మహిళలకు మున్సిపల్ చైర్ పర్సన్ బొట్లు పెట్టి గాజులు తొడిగారు. అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం కార్యక్రమంలో నిర్వాహకులు పసుపర్తి జ్యోతి కృష్ణమూర్తి మాట్లాడుతూ తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. గర్భిణీ స్త్రీలకు వాయినాలుగా ఇరవై ఒక్క వస్తువులు, రెండు బోజన ప్లేట్లు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్త్రీ నిధిలో పక్కదారి రూ. 14.54 లక్షలు అక్రమాలు

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్



మహిళా సంఘాల సభ్యులకు అండగా ఉండాల్సిన స్త్రీ నిధి నిధులు పక్కదారి పట్టాయి. సభ్యులు కష్టపడి కట్టిన వాయిదా డబ్బులను విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ తన సొంతానికి వాడుకున్నాడు. ఈ భారీ అవకతవకలు కలెక్టర్ గ్రీవెన్స్ విచారణలో బయటపడటంతో నిందితుడైన వీఓఏపై వేటు పడింది. తుంగతుర్తి మండలం గానుగబండ గ్రామ సమాఖ్యలో అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. గానుగబండ గ్రామ సమాఖ్యలో 2022లో స్త్రీ నిధి రుణాలు మంజూరయ్యాయి. సభ్యులు తమ నెలవారీ వాయిదాలను క్రమం తప్పకుండా వీఓఏ సైదులుకు చెల్లిస్తున్నారు. అయితే, సైదులు ఆ డబ్బును పూర్తిగా స్త్రీ నిధి ఖాతాలో జమ చేయకుండా సొంతనికి వాడుకున్నారు. సభ్యుల నుంచి ముందస్తు వాయిదాల పేరుతో భారీగా వసూలు చేసి, బ్యాంకు రికార్డుల్లో మాత్రం కనీస మొత్తమే చెల్లిస్తూ మిగతా సొమ్మును స్వాహా చేశాడు. నిబంధనల ప్రకారం వీఓఏలు ఎలాంటి ఆర్థిక లావాదేవీలు చేయకూడదని రూల్ ఉన్నప్పటికీ, ఇక్కడ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ అక్రమాలపై ప్రజావాణిలో ఫిర్యాదులు రావడంతో స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ శివప్రసాద్ ఈ ఏడాది మార్చిలో ఎంక్వయిరీ చేశారు. ఈ విచారణలో వీఓఏ సైదులు అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో, అతను స్వాహా చేసిన రూ. 14,54,000 తిరిగి స్త్రీ నిధి ఖాతాలో రీపేమెంట్ చేయించారు. కేవలం వీఓఏ మాత్రమే కాకుండా, ప్రస్తుతం ఉన్న ఆఫీస్ బేరర్లు కూడా ఈ అక్రమలలో సహకరించినట్లు విచారణలో తేలింది. వీఓఏ నిధులు దారి మళ్లిస్తున్నా పట్టించుకోకపోవడం, విచారణ సమయంలో సరిగ్గా స్పందించకపోవడంతో వారిపై కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక అవకతవకలకు పాల్పడిన వీఓఏ సైదులును తక్షణమే విధుల నుంచి తొలగించాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఆఫీస్ బేరర్లను కూడా ఆ పదవుల నుంచి తీసేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ డిఆర్డిఓ పిడి సన్యాసయ్య ను చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.

## ఆర్టీసి యాజమాన్యంతో జరిగిన చర్చల్లో అంగీకరించిన అంశాలను అమలు చేయాలి

భానుపురి /సూర్యాపేట టౌన్

ఏప్రిల్ లో జరిగిన ఆర్టీసి సమ్మె సందర్భంగా ఈడీ అధికారులతో జరిగిన చర్చల్లో అంగీకరించిన అంశాలు నేటి వరకు అమలుకు నోచుకోలేదని వెంటనే అమలు పర్చే విదంగా యాజమాన్యం చొరవ చేయాలని స్టాఫ్ ఑ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ )రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్ అన్నారు రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈడీల కమిటి కార్మిక సంఘాలతో జరిగిన చర్చలు రెండు నెలల పైబడుతున్న నేటి వరకు అమలు చేయలేక పోవడం చాలా దుర్మార్గమన్నారు .ప్రభుత్వం అంగీకరిం చిన 80 శాతం అలవెన్స్ లను అమలు చేయాని, బ్రెడ్ విన్నర్ స్కీమ్ కార్మికులకు వెంటనే రెగ్యులర్ ఆర్డర్ ఇవ్వాలని, సంపూర్ణ ఉద్యోగ భద్రత కమిటీని ఏర్పాటు చేసి అతి త్వరగా ఉద్యోగ భద్రత ఆర్డర్ ని జారీ చేయాలని అన్నారు, జూనియర్ అసిస్టెంట్ పరీక్ష పాసైన కండక్టర్, డ్రైవర్,మెకానికులు ఎప్పుడు పోస్టులను భర్తీ చేస్తారో అని ఎదురు చూస్తున్నారని,దినదిన గండం నూరేళ్ల ఆయుషు అంటూ ఉద్యోగం చేస్తున్నారని వాపోయారు.. అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష,కార్యదర్శులు రవి, లక్ష్మయ్య, డిపో కోశాధికారి



వేల్పుల. వెంకన్న, సహాయ కార్యదర్శి కే.నాగరాజు, నాయకులు జి ఎల్ రావు, ఇంద్ర సైదులు, నరేష్ కొమరయ్య, సంధ్యా, బేగం, శ్రీనివాస్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు

# సూర్యాపేట అభివృద్ధే లక్ష్యం

భానుపురి /సూర్యాపేట టౌన్



సూర్యాపేట అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 9వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో మురికి కాలువపై బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ నుంచి మంజూరైన రూ.5 లక్షల నిధులతో చేపడుతున్న ఈ పనుల ద్వారా స్థానికుల రాకపోకలు సులభతరం అవుతాయని ఆమె తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీ ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే 9వార్డు నుంచి కొన్ని సమస్యలు వచ్చాయని వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, స్థానిక కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు బంటు చోక్కయ్య, మన్నెం మల్లేష్, కోడి శివ, జానయ్య, వీరమల్ల రవి చరణ్, జవాను శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్




సూర్యాపేట జిల్లా కేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు తగిన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ రజక సంఘశీ జిల్లా నాయకులు & చాకలి ఐలమ్మ సేవా సమితి జిల్లా అద్యక్షులు అక్కెనపల్లి జానయ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సమాజ శ్రేయస్సు కోసం పోరాడిన మహనీయుల విగ్రహాలను నెలకొల్పడం ద్వారా భావి తరాలకు వారి సేవలు గుర్తుంటాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంధలాల్ పవార్ విగ్రహ ఏర్పాటుకు పరిశీలించి తగిన స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని సానుకూలంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే సాధన ఉద్యమానికి కొత్త ఊపు

భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేటకు రైల్వే మార్గం సాధనే లక్ష్యంగా ఏర్పాటైన రైల్వే సాధన సమితి ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తూ కన్వీనింగ్ కమిటీని విస్తరించింది. ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కొత్త నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించింది. సమితి నిర్ణయం మేరకు ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఆదుర్తి రమేష్ చంద్రను మరో లిసహ-కన్వీనర్ (కో-కన్వీనర్)లిగా నియమించారు. ఉద్యమ కార్యక్రమాల సమన్వయం, వివిధ సంఘాలు, ప్రజాసంఘాలతో అనుసంధానం బాధ్యతలను నిర్వహించేందుకు బిక్కుమల్ల ఉపేందర్ను ఉద్యమ సమన్వయకర్తగా నియమించారు. అదే విధంగా కన్వీనింగ్ కమిటీలో కే. మంజుల, సముద్రాల రాంబాబు, మారోజు కృష్ణ మూర్తి, ఎం.డి. ఖలీల్, పోతురాజు నరసయ్య, ఎం.డి. ఆసరార్ అహమ్మద్లను సభ్యులుగా చేర్చుతూ కమిటీని మరింత బలోపేతం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో త్వరలోనే విస్తరించిన కన్వీనింగ్ కమిటీతో పాటు పూర్తి కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి, రాబోయే కార్యాచరణను ఖరారు చేయాలని నిర్ణయించారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ఉద్యోగ, విద్యార్థి, వ్యాపార, సామాజిక సంఘాలను కలుపుకుంటూఉద్యమాన్ని మరింత విస్తృత ప్రజా ఉద్య మంగా తీర్చిదిద్దాలని సభ్యులు అభిప్రాయ పడ్డారు. సూర్యాపేట జిల్లా అభివృద్ధికి అత్యంత కీలకమైన హైదరాబాద్--సూర్యాపేట--ఖమ్మం రైల్వే మార్గం సాధన కోసం అన్ని వర్గాల ప్రజల సహకారంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని సమావేశం పిలుపు నిచ్చింది. రాబోయే రోజుల్లో మహాజర్లు, ప్రజా సమావేశాలు, సంతకాల సేకరణ, ప్రజాప్రతినిధులతో భేటీలు తదితర కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సమితి నాయకులు తెలిపారు.




# సూర్యాపేట ను బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లో చేర్చండి

భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేంతవరకు అలుపెరుగని ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి హెచ్చరించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంజనాపూరి కాలని దగ్గర జాతీయ రహదారి65 పై అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసూర్యాపేట జిల్లా కేంద్రం జాతీయ రహదారి--65పై ఉన్న ప్రధాన వాణిజ్య పట్టణమని, తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే ప్రజలకు కీలక రవాణా కేంద్రంగా నిలిచిందని పేర్కొన్నారు. వరి, పత్తి, ఎర్ర మిరప, జొన్న వంటి పంటల ఉత్పత్తి, పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు, విద్యా మరియు పారిశ్రామిక సంస్థలతో సూర్యాపేట ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని అన్నారు. గతంలో ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను చేర్చినప్పటికీ, ప్రస్తుతం పరిశీలిస్తున్న మూడో అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను తొలగించడం సూర్యాపేట జిల్లా ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సూర్యాపేట జిల్లాలో గత 20 సంవత్సరాలుగా రైల్వే మార్గం కోసం పోరాటాలు కొనసాగుతున్నాయని అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ రాకుంటే సూర్యాపేట జిల్లా అంధాకారంలోకి నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు దశాబ్దాలుగా రైల్వే సౌకర్యం కోసం చిరకాలంగా సూర్యాపేట ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. బుల్లెట్ రైన్ సాధించేంతవరకు దశల వారిగా ఉద్యమాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పోలీసులు ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



# వనపర్తిలో కార్గిల్ విజయ దివాస్






భానుపురి/ వనపర్తి:

కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా మరణించిన కార్గిల్ వీర జవాన్లను తలుచుకుంటూ భరతమాత సేవలో మేము కూడా భాగ్యస్వామ్యం అవుతామని ముందుకు వచ్చిన విద్యార్థులకు అగ్నివేర్ ఆర్మీ ర్యాలీ పోలీస్ ఉద్యోగాలలో 1600 మీటర్స్ రన్నింగ్ కాంపిటేషన్ ఉండటం జరుగుతుంది. ఈ కాంపిటేషన్ ముందస్తు విభాగంలో వనపర్తి జిల్లాలో జై జవాన్ జై కిసాన్ ఎక్స్ ఆర్మీ మహేష్ ఆర్మీ ఫిజికల్ ట్రైనర్ ఎక్స్ సర్వీస్ మైన్స్ ఆధ్వర్యంలో యువతను సన్మార్గంలో తీసుకురావడానికి ముందుగా అగ్ని వీర్ ఆర్మీ పోలీస్ నియమాకలో ఉండే 1600 మీటర్, ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో మొదటి బహుమతి శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పూరి సురేష్ శెట్టి, కొన్నూరు టిల్లు నాయక్ కు ఇవ్వడం జరిగినది. జై జవాన్ జై కిసాన్ ఎక్స్ ఆర్మీ మహేష్ ఫ్రీ డిఫెన్స్ అకాడమీ వనపర్తి స్టూడెంట్, రెండో బహుమతి, గణేష్ వాకింగ్ గ్రూప్ వారు, రవితేజ జై జవాన్ జై కిసాన్ ఫ్రీ డిఫెన్స్ అకాడమీ వనపర్తి, మూడో బహుమతి కే శేఖర్ ,నాలుగో బహుమతి ప్రవీణ్, ఐదో బహుమతి గణేష్ లకు ఇవ్వడం జరిగింది. ఈ ప్రోగ్రాంను జై జవాన్ జై కిసాన్ ఎస్ ఆర్మీ మహేష్ ఫ్రీ డిఫెన్స్ అకాడమీ ఎక్స్ సర్వీస్ మేన్స్ నిర్వహించడం జరిగింది. వనపర్తి డిస్టిక్ ఎక్స్ ఆర్మీ ప్రెసిడెంట్ వెంకటేశ్వర రెడ్డి స్పోర్ట్స్ ఆఫీసర్ సుధీర్ రెడ్డి పోచా రవీందర్ రెడ్డి వనపర్తి డిస్ట్రిక్ట్ చైర్మన్ నందిమల్ల శ్రీనివాస్ విద్యార్థులకు ఫ్యాకల్టీ ఇచ్చిన నరసింహ, శివ అతి తక్కువ సమయంలో 15 సభ్యులకు గాను 14 సబ్యులు సెలెక్ట్ కావడం జరిగింది. ఇంతకుముందు బ్యాచ్ లో 7 సభ్యులకు కు ట్రైనింగ్ ఇవ్వగా ఫిజికల్ టెస్టు లో 7 గురుకి 7 సెలెక్ట్ కావడం జరిగింది.

# హైకోర్టు ఆదేశాలపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్..

భానుపురి ప్రతినిధి

హైడ్రా కమిషనర్ రంగనాథ్ విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి రంగనాథ్‌ను తొలగించాలని.. ఆయన స్థానంలో అర్హులైన అధికారిని నియమించాలని సీఎస్‌కు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.. అయితే ఈ ఆదేశాలపై తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. తాము రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే పనిచేస్తున్నామని ప్రభుత్వ ఆస్తులు కాపాడడమే తమ లక్ష్యమన్నారుచ్చిన తీర్పుపై రంగనాథ్ స్పందించారు. తాము రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే పనిచేస్తున్నామని, చెరువులు, ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే హైడ్రా ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటివరకు సుమారు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించి, వేల ఎకరాల భూములను వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి అప్పగించిందని, ఇటీవల లోతుకుంటలో భూకబ్జా యత్నాన్ని కూడా అడ్డుకుందని తెలిపారుఆక్రమణల తొలగింపుతో పాటు ఇప్పటికే 6 చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ల్యాండ్ మాఫియా కోర్టులను తప్పుదోవ పట్టిస్తోందని, తనపై ఉన్న కోర్టు ధిక్కార కేసులన్నీ భూకబ్జాదారులు వేసినవేనని ఆరోపిస్తూ, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని.. ఆ కేసులన్నింటినీ చట్టపరంగానే ఎదుర్కొంటానని ఆయన అన్నారు.



**ప్రభుత్వం ఏం చేయబోతుంది?**

హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయబోతోందనే అంశంపైనే అందరి దృష్టి నెలకొంది. హైడ్రా కమిషనర్‌గా దాదాపు రెండేళ్ల నుంచి కొనసాగుతూ వచ్చిన రంగనాథ్ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందనే విషయంలో సస్పెన్స్‌గా మారింది. అయితే హైకోర్టు ఆదేశాలపై ఆచితూచి స్పందించాలని ప్రభుత్వం నభావిస్తోంది. రంగనాథ్ విషయంలో వేచి చూసే ధోరణిలో ముందుకు సాగాలని యోచిస్తోంది. తీర్పునకు సంబంధించిన ఆర్డర్ కాపీ ఆధారంగా న్యాయసలహా తీసుకోవాలని డిసైడయ్యింది. ఇక ఈ విషయాన్ని ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు ఇంటలిజెన్స్ చీఫ్. దీనిపై న్యాయసలహా తీసుకోవాలని సీఎస్‌కు సీఎం రేవంత్ ఆదేశించినట్టు తెలుస్తోంది. ఇక హైడ్రాపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసులపై సీఎస్ ఆరా తీస్తున్నట్టు సమాచారం. మరోవైపు ఈ కేసులో సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీల్‌కు వెళ్లడంపై ప్రభుత్వం సమాలోచనలు జరుపుతున్నట్టు తెలుస్తోంది




## ఆగస్టు 1 నుంచి మారనున్న కొత్త నిబంధనలు ఇవే..

# మీ జేబుపై ప్రత్యక్ష ప్రభావం.!

భానుపురి ప్రతినిధి:

ఇప్పుడు జూలై నెల ముగియబోతోంది. ఆగస్ట్ నెల రాబోతోంది. వచ్చే నెలలో పలు అంశాలలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ముఖ్యంగా ఎల్‌పీజీ గ్యాస్, బ్యాంకింగ్, భారత రైల్వేలలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. అయితే ఆగస్ట్ నెలలో ఎలాంటి నిబంధనలు అమల్లోకి రానున్నాయో ముందస్తుగా తెలుసుకోవడం చాలా ముఖ్యం..ఆగస్టు నెల ప్రారంభం కాబోతోంది. దీనితో పాటు అనేక ప్రధాన మార్పులు (ఆగస్టు 1, 2026 నాటి కొత్త నిబంధనలు) కూడా జరగబోతున్నాయి. కొత్త కేవైసీ విధానాన్ని అమలు చేయబోతున్నారు. పశ్చిమ మధ్య రైల్వే కూడా తత్కాల్ టిక్కెట్లకు సంబంధించిన నిబంధనలలో సవరణలను ప్రకటించింది. ఓపెన్ మార్కెట్ షేర్ బైబ్యాక్‌ల కోసం సెబీ (ాజుదీ×) కూడా కొత్త నిబంధనలను అమలు చేయనుంది. ఈ మార్పులు సాధారణ ప్రజలపై నేరుగా ప్రభావం చూపుతాయి. అందువల్ల వాటి గురించి ముందుగానే తెలుసుకోవడం ముఖ్యం.ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతినెలా ఎల్పీజీ సిలిండర్ ధరలను సవరిస్తాయి. ఆగస్టు 1వ తేదీన కూడా సిలిండర్ ధరలలో హెచ్చుతగ్గులు ఉండవచ్చు. జూలై 1వ తేదీన, 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.183.50 తగ్గించారు. 5 కేజీల సిలిండర్ ధరను రూ.13 తగ్గించారుఖ్జకి సంబంధించిన కొత్త నిబంధనలు:

రాయిటర్స్ వార్తా సంస్థ ప్రకారం, బ్యాంకులు, బీమా కంపెనీలు సంయుక్తంగా ఆగస్టు 1వ తేదీన 'సెంట్రల్ కేవైసీ 2.0' అనే సమగ్ర వినియోగదారుల గుర్తింపు వ్యవస్థను ప్రారంభిస్తున్నాయి. ఈ కొత్త వ్యవస్థ అమలు బ్యాంకింగ్, పెట్టుబడి ప్రక్రియలను కూడా మార్చివేస్తుంది. వినియోగదారులు ఇకపై ప్రతి ఆర్థిక సంస్థకు వేర్వేరు గుర్తింపు కార్డులను సమర్పించాల్సిన అవసరం ఉండదు. ఆస్తి నిర్వహణ కంపెనీలు, మ్యూచువల్ ఫండ్‌లు కూడా ఈ నెట్‌వర్క్‌లో చేరవచ్చు. వినియోగదారుడు కొత్త ఖాతాను తెరిచినప్పుడు లేదా సమాచారాన్ని నవీకరించినప్పుడు, సంస్థ వినియోగదారుడి సమ్మతితో కేంద్ర రిజిస్ట్రీ నుండి ధృవీకరించిన సమాచారాన్ని పొందవచ్చు. ఈ సమాచారం వినియోగదారుడి మొబైల్ నంబర్‌కు అందుతుంది. ఆమోదం పొందిన తర్వాత ప్రక్రియ పూర్తవుతుంది.

**రైల్వే టిక్కెట్ బుకింగ్‌కు సంబంధించిన నియమాలు:**

పశ్చిమ మధ్య రైల్వే తత్కాల్ టికెట్ బుకింగ్ ప్రక్రియలో మార్పులను ప్రకటించింది. ఆగస్టు 1 నుంచి కొత్త టోకెన్ నిబంధన అమలులోకి రానుంది. ఈ కొత్త నిబంధన అమలుతో ప్రయాణికులు రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌కు రెండుసార్లు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఏసీ 1 క్లాస్ టోకెన్లను ఉదయం 8:30 నుంచి 9:00 గంటల మధ్య బుకింగ్ ఉంటుంది. కాగా, నాన్-ఏసీ క్లాస్ టోకెన్లను ఉదయం 9:00 నుంచి 9:30 గంటల మధ్య పంపిణీ చేస్తారు. ప్రస్తుతం, ఎఫ్‌సీ క్లాస్‌లో తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులకు ఉదయం 9:00 నుంచి 9:25 గంటల మధ్య టోకెన్లు ఇస్తున్నారు. కాగా, నాన్-ఏసీ క్లాస్ టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులకు ఉదయం 9:30 నుంచి 9:55 గంటల మధ్య టోకెన్లు ఇస్తున్నారుబ్యాంకింగ్ కొత్త నిబంధనలు:

కోటక్ మహీంద్రా బ్యాంక్ ఆగస్టు 1వ తేదీ నుండి డెబిట్ కార్డుల కోసం కొత్త నిబంధనలను అమలు చేస్తోంది. డైనమిక్ కరెన్సీ కన్వర్షన్ ఫీజులను పెంచారు. ఱజజ ఫీజు లావాదేవీ మొత్తంపై 3.5%, గా ఉంటుంది. ప్రస్తుతం ఈ ఫీజు 1%, జీఎస్టీగా ఉంది. ఈ ఫీజు అంతర్జాతీయ వ్యాపారులతో చేసే లావాదేవీలకు కూడా వర్తిస్తుంది.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ జమీా, చీూజ఺ సేవల రుసుములను సవరించింది. ఈ కొత్త నిబంధనలు ఆగస్టు 1 నుండి అమల్లోకి వస్తాయి. వీటిలో ,, డైరెక్ట్ డెబిట్ మాండేట్ బిజినెస్ సర్వీసెస్ ఉన్నాయి. యూపీఐ మాండేట్ రిజిస్ట్రేషన్ కోసం పీఎన్‌బీ కస్టమర్లు ఒక్కో మాండేట్‌కు రూ.125 చెల్లించాల్సి ఉంటుంది. ఆర్థిక కారణాల వల్ల లావాదేవీల వాపసు ఛార్జీలను ఒక్కో లావాదేవీకి రూ.250కి పెంచినట్లు బ్యాంక్ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించింది.

**సెబీ ఈ నిబంధనలను మార్చింది:**

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఒక నోటిఫికేషన్ జారీ చేస్తూ, ఓపెన్ మార్కెట్‌లో షేర్ల బైబ్యాక్‌లను నియంత్రించే నిబంధనలను సవరించింది. ఆగస్టు 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చే ఈ కొత్త నిబంధనలు, ఓపెన్ మార్కెట్‌లో ఒకరి సొంత షేర్లను తిరిగి కొనుగోలు చేయడానికి అనుమతిస్తాయి. బైబ్యాక్ కాలపరిమితిని గరిష్టంగా 66 పనిదినాలుగా నిర్ణయించారు. బైబ్యాక్ విండో లేకుండా సాధారణ ట్రేడింగ్ ద్వారా కూడా తిరిగి కొనుగోళ్లకు అనుమతి ఉంటుంది. "స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా ఓపెన్ మార్కెట్‌లో షేర్ల తిరిగి కొనుగోళ్లు, కంపెనీ చెల్లించిన మూలధనం, ఉచిత నిల్వలలో 15% కంటే తక్కువగా ఉండాలి. దీనిని కంపెనీ స్టాండలోన్, కన్సాలిడేటెడ్ ఆర్థిక నివేదికల ఆధారంగా లెక్కిస్తారు. బైబ్యాక్ ఆఫర్, బహిరంగ ప్రకటన వెలువడిన తేదీ నుండి నాలుగు పనిదినాలలోపు ప్రారంభమై, ప్రారంభమైన తేదీ నుండి 66 పనిదినాలలోపు ముగుస్తుందని ాజుదీ× స్పష్టం చేసింది.డ్రైవింగ్ లైసెన్స్, ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన నిబంధనలలో మార్పులు:

మహారాష్ట్ర రాష్ట్ర రవాణా శాఖ డ్రైవింగ్ లైసెన్సులకు సంబంధించిన నిబంధనలలో మార్పులు చేసింది. ఇవి ఆగస్టు 1, 2026 నుంచి అమల్లోకి వస్తాయి. వచ్చే నెల నుంచి డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి రాష్ట్ర నివాస ధృవీకరణ పత్రం తప్పనిసరి అవుతుంది. ఢిల్లీ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన నిబంధనలలో మార్పులు చేస్తోంది. ఆగస్టు 1వ తేదీ నుంచి ఢిల్లీలో ఉచిత బస్సు ప్రయాణానికి పింక్ సహేలి స్మార్ట్ కార్డ్ తప్పనిసరి అవుతుంది. అయితే, జూలై 31వ తేదీ వరకు పాత పేపర్ టికెట్ విధానం అమలులో ఉంటుంది.